'ఈ పండితుడు తన తాలూకు కావ్యకన్యకను నాకు తెచ్చి ఇవ్వడంలో వుద్దేశ మేమిటోయ్?'

'చిత్తం! తమరికిగాక ఇంకెవరికిస్తాడండి? తమరే సర్వవిధాలా దాన్ని స్వీకరించడానికి అర్హులు--'

'మా బాబయ్యగారు బ్రతికివుండే రోజుల్లో ఆయన ఇలా...ఏమైనా స్వీకరించాడా?'

'లక్షలాది! ఇందులో తప్పేముందండీ?'

'సరే అయితే! దాని పేరేమిటోయ్?'

'దేని పేరండీ?'

'అదేనయ్యా, ఈ పండితుడు మనకి ఇవ్వబోయే—'

'చంద్రకళండి—'

'పేరు చక్కగా వుంది!'

'పేరుకుతగిన ఆకర్షణ కూడా వుందండి దానిలో.'

'అయితే... శేషయ్యా?'

'చిత్తం! ప్రభూ!'

'మాడూ, దాని వయస్సెంతా...?'

'...............'

# అభ్యుదయం

'శేషయ్యా?'

'ప్రభూ!'

'నువ్వు తిమ్మరుసువంటి వాడివోయి—'

'ఏదో, ప్రభువులు అభిమానం కొద్దీ అలా అంటారే గాని—'

'శేషయ్యా?'

'చిత్తం! దేవా!'

'నీ వినయాన్ని మెచ్చుకున్నానోయి-నీ బుర్ర తిమ్మరుసు బుర్రను మించిన బుర్ర-'

'చిత్తం! ప్రభువుల కటాక్షం - ఇంతకూ ఇదంతా ఎందుకో శెలవిచ్చారు కాదు-'

'వస్తున్నాం ఆ విషయానికే-అయితే చూడు, శేషయ్యా?'

'చూస్తున్నా దేవా!'

'మన సంస్థానంలో ఏ. ఆర్. పి. లేకపోవడం మన రాజనీతికి భిన్నం కాదటోయి?'

'చిత్తం! కాదని ఎవరనగలరండీ? కాని, మన సంస్థానమంతా పల్లెటూళ్ళే గదండీ-ఇక్కడ ఏ. ఆర్. పి. అవసరం ఏమంత వుంటుంది గనకా-?'

'శేషయ్యా!'

'హాఁ! ప్రభూ!'

'ఈ మధ్యకాలంలో నీ నోటివెంట ఇంత చచ్చు సలహా రాలేదోయి-'

'పొరబాటు! లెంపలు వాయించుకుంటున్నానండి!'

'ఇప్పుడైనా గ్రహించావా మన సంస్థానంలో ఏ. ఆర్. పి. వుండాలనీ?'

'చిత్తం! ప్రభువులు తలుచుకుంటే...?'

'వెంటనే ఏర్పాటు చేయాలి, మన సంస్థానమంతటా—'

'ఏ. ఆర్. పి. యేనాండీ?'

'అక్షరాలా! దాని కంతకూ ప్రధానోద్యోగి—ఎవరనుకున్నావు?'

'చిత్తం! ఎవరనుకున్నానండీ?'

'మీ పెద్దబ్బాయి—ఇచ్చాం అతడికా పదవి—'

'ధన్యోస్మి!'

'ఈ దెబ్బతో మనంకూడా నాగరికతగలవారిమేననీ మన సంస్థానం ఇతర ప్రాంతాలకు ఏవిధంగానూ తీసిపోదనీ ప్రపంచానికి తెలియ వస్తుంది—'

'అవునండి—అవును !'

ఇన్నాళ్లనుంచిఏ. ఆర్. పి. లేకండా వెనకబడి వున్నాం ! శేషయ్యా, ఎంత చిన్నతనమోయి మనకూ?'

'నిజమేనండి ! ఇప్పటికేనా తమకీ నిశ్చయం కలగడం—'

'శేషయ్యా ! మనం ఏర్పాటు చేయబోయే ఏ. ఆర్. పి. కి ఒక ప్రత్యేకత వుండాలి—అన్ని ఏ. ఆర్. పి. లను మల్లే గాకుండా.'

'ఔనండి ! వుండాలి---'

'యుద్ధం అయిపోయినాక కూడా మన ఏ. ఆర్. పి. పనిచేస్తూనే వుంటుంది, ఇతర శాఖలను మల్లేనే-—కాదూ?'

'అవునండి ! అప్పుడే మన కీర్తి లోకానికి బాగా తెలియవస్తుంది !'

'అయితే చూడు శేషయ్యా-జపానువాడు వుత్త వెధవోయి—వాడికి మంచీ, మర్యాదా తెలీదు—'

'అవునండి !'

'మన సంస్థానం మీదికి ఒక్క విమానాన్నికూడా పంపించాడా ఎప్పుడైనా?'

'వెర్రివెధవ! ఇంతటి ప్రభువు లిక్కడ వున్నారని వాడు గ్రహిస్తేగా? అయినా, మనవన్నీ పల్లెటూళ్లండి-—'

'కనీసం మన వూరిమీదకైనా ఒకమాటు, మనం ఇంతగా ముచ్చట పడి—?'

'ముందు మన ఏ. ఆర్. పి. ఏర్పాటు పూర్తి చేద్దామండి—దాన్ని చూసైనా ఒకటి రెండు విమానాలు మన మించి ఎగరకపోవు---'

'ఒక్క విమానం వచ్చినా చాలు ! మన వూళ్ళో విమానదాడి హెచ్చరిక జరిగితే వినాలని తపించి పోతున్నాను—'

'మీ ఆశయం త్వరలోనే నెరవేరే సూచనలా కన్పిస్తున్నాయండి-'

'ఏమిటా సూచనలూ?'

'చిత్తం ! తమరూ నేనేనండి !'